క్లుప్తంగా

బొత్స దృష్టికి ట్రస్ట్ సేవలు

డాబాగార్డెన్స్: నూతన్ సేవ ట్రస్ట్ చైర్మన్ సతివాడ ఈశ్వరరావు, సతివాడ యశోద అరుణ్‌రాజ్ తమ సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ట్రస్ట్ చేపడతున్న సేవా కార్యక్రమాలు వివరించారు.

దివ్యాంగుల డిమాండ్లు నెరవేర్చాలి



నిరసన తెలుపుతున్న దివ్యాంగుల హక్కుల సమితి నాయకులు

సీతమ్మధార: రాజకీయ పార్టీలు దివ్యాంగులకు అందించే పథకాలను మేనిఫెస్టోలో పెట్టాలని, ఎమ్మెల్యే, ఎంపీ పదవులను దివ్యాంగులకు కేటాయించాలని డాక్టర్ సురేంద్రమోహన్ డిమాండ్ చేశారు. దివ్యాంగుల హక్కుల సమితి ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని, కేజీ టూ పీజీ ఉచిత విద్య అందించాలని, అన్ని రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో 3 శాతం షాపులు కేటాయించాలని, ప్రతి ఏడాది రూ.50 వేల చేయూత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి, భాగ్యలక్ష్మి, ఒ.రాంరాజు, వి.వీరభద్రం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు మెరుగుపరచుకోవాలి



అధ్యాపకులు, విద్యార్థులతో ఇంతియాజ్ హర్షద్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేతృత్వంలో 'టీమ్ బిల్డింగ్ – లీడర్ షిప్'పై సోమవారం అధ్యాపకులకు, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ సీఈవో, కార్యదర్శి ఇంతియాజ్ హర్షద్ మాట్లాడారు. అధ్యాపకులు టీమ్ బిల్డింగ్‌పై పూర్తి అవగాహన కలిగి వుండాలని, నాయకత్వ లక్షణాలు మెరుగుపరచుకోవాలని సూచించారు. రకరకాల ఆటలు, పజిల్స్, నాటికల ద్వారా అధ్యాపకులు, విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ హేమ, పీఆర్‌వో డాక్టర్ పీకే జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం'



బూత్ కమిటీ అధ్యక్షులతో తోట పద్మావతి, కర్రి నీలకంఠం

అల్లిపురం : రానున్న సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ సభ్యులు సిద్ధమవ్వాలని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి పిలుపునిచ్చారు. 33, 34, 35, 41 వార్డుల మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం అధ్యక్షతన తోట పద్మావతి ఆధ్వర్యంలో వార్డు కార్యాలయంలో బూత్ కమిటీల అధ్యక్షులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బూత్ కోర్ కమిటీ సభ్యులు ఆయా క్లస్టర్‌లోని వలంటీర్లు, గృహ సారథులను సమన్వయం చేసుకుని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. ఎన్నికలయ్యేలోపు అన్ని ఇళ్లకు కనీసం 5 నుంచి 6 సార్లు వెళ్లి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని వివరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు లింగం శ్రీనివాస్, తాతబ్బాయి, బూత్ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

గ్లకోమాపై సదస్సులు

సీతంపేట: రామాటాకీస్ రోడ్డులోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ప్రపంచ గ్లకోమా అవగాహన వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన సదస్సులో సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.మీనాక్షి కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 16 వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గ్లకోమా అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందరికీ న్యాయం



పండా వీధిలో టీడీపీ కార్యకర్త నాయని కుమారికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2.50 లక్షల చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



దొండపర్తిలో దళాయి అప్పలస్వామిరెడ్డికి రూ.65 వేల చెక్కు అందిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

- కులమతాలు, పార్టీలకతీతంగా సహాయం
- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.4.77 లక్షల చెక్కుల పంపిణీ
- టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.2.50 లక్షల అందజేత

మహారాణిపేట: కులమతాలు, వర్గాలు, పార్టీలకతీతంగా కష్టాల్లో ఉన్న అందరికీ సహాయం చేయడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. కష్టాల్లో ఉన్న టీడీపీ కార్యకర్తకు కూడా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2.50 లక్షల అందించిన ఘనత జగనన్నదేనని తెలిపారు. మాట తప్పని.. మడం తిప్పని గొప్ప నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, జెండాలు, పార్టీలు చూడకుండా ప్రతి ఒక్క అర్హుడికి న్యాయం చేయాలని ధ్యేయంతో పని చేస్తున్నారని చెప్పారు. దీనికి నిదర్శనం 35వ వార్డు పండా వీధికి చెందిన టీడీపీ కార్యకర్త నాయని కుమారి భర్త శ్రీను బ్రెయిన్ స్ట్రోక్‌తో చనిపోవడంతో ఆర్థిక సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయగా.. నిధులు విడుదలై చెక్కు అందజేశామని తెలిపారు.



పూర్ణామార్కెట్‌లో పాలిక రమణమ్మకు చెక్కు అందజేస్తున్న వాసుపల్లి

నలుగురికి సహాయం

నలుగురు బాధిత కుటుంబాలకు సోమవారం మొత్తం రూ.4.77 లక్షల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి అందజేసి, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితులకు గత నెలలో తన సొంత నిధులు రూ.5 వేల చొప్పున ఆయన అందించారు. 27వ వార్డు దొండపర్తి శీరపువారి వీధిలో నివసించే దళాయి అప్పలస్వామి రెడ్డికి రూ.65 వేలు, 35వ వార్డు పండా వీధిలో నివసించే టీడీపీ కార్యకర్త నాయని కుమారికి రూ.2.50 లక్షలు, 35వ వార్డు పండా వీధి పూర్ణా మార్కెట్‌లో నివసించే పాలిక రమణమ్మకు రూ.22 వేలు, 36వ వార్డు ఆసిపాప వీధి ఏవీఎస్ కాలేజీ డౌన్‌లో నివసించే చొక్కా నూకాలమ్మ రూ.1.40 లక్షలను విలువైన చెక్కులను వాసుపల్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, పార్టీ మండల అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, స్టేట్ డైరెక్టర్లు, స్టేట్, జిల్లా సీనియర్ నాయకులు, ఆలయ చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత విశాఖకు సహకరించండి

డాబాగార్డెన్స్: వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించి విశాఖలో కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి కోరారు. సోమవారం ఆమె తన క్యాంప్ ఆఫీస్ నుంచి జీవీఎంసీ కార్యాలయానికి ప్రజా రవాణా ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్) కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో విపరీతంగా పెరుగుతున్న కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు వారంలో ఒకరోజు ప్రజా రవాణాను ఉపయోగిస్తున్నారన్నారు. విశాఖలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించేందుకు నగర ప్రజలు సహకరించి వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.



కాలినడకన జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి

'జగనన్నకు చెబుదాం' వినతులకు తక్షణ పరిష్కారం



వినతులు పరిశీలిస్తున్న జోన్–4 కమిషనర్ ప్రసాదరావు

జగదాంబ: జగనన్నకు చెబుదాం కార్యాక్రమానికి వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు ఆదేశించారు. సూర్యాబాగ్‌లోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి మూడు అర్జీలు వచ్చాయి. రెవెన్యూ సెక్షన్‌కు రెండు, పబ్లిక్ హెల్త్‌కు సంబంధించి ఒకటి ప్రజలు అందజేశారు. సంబంధిత అధికారులతో కలిసి వినతులను పరిశీలించి రిపోర్టు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ స్థాయి అధికారులు ఇంజినీరింగ్ ఈఈ సంతోషికుమారి, ఏఎంహెచ్‌వో రాజేష్, ఏపీడీ పుణ్యవతి, ఆర్వో అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

డోర్ టూ డోర్ చెత్త సేకరణ

పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలని జోన్–4 కమిషనర్ ప్రసాదరావు సూచించారు. సోమవారం ఆయన 38వ వార్డు టౌన్ హాల్ రోడ్డు, కంచర వీధి, పప్పుల వీధి ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఇంటితోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలు పాల్గొన్నారు.

జోన్–5కు ఏడు అర్జీలు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జోన్–5 కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జెడ్సీ కృష్ణ ఏడు వినతులు స్వీకరించారు.

ఈద్గా విస్తరణకు సహకరించండి

పోర్టు చైర్మన్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధి, జీవీఎంసీ 39వ వార్డులో గల ఈద్గా విస్తరణకు పోర్టు ఆధీనంలో వున్న పదిహేను అడుగుల స్థలాన్ని కేటాయించాలని పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తును మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ఈద్గా ప్రాంగణం చిన్నారులు ఆడుకునేందుకు, రంజాన్, మొహర్రం, బక్రీదు పండగ సమయాల్లో నమాజ్ చేసుకునేందుకు, అనేక విధాలుగా స్థానికులు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానికులు, అంబుసరంగ్ మసీదు కమిటీ ఇటీవల పార్కు విస్తరణకు అడ్డంకిగా ఉన్న సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ నిధులతో అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉన్నప్పటికీ, పోర్టు కల్వర్టు స్థలం కలుపుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోర్టు అథారటీ అనుమతులు తీసుకొని అభివృద్ధికి శ్రీకారం చుట్టే ముందు పోర్టు చైర్మన్ అంగముత్తు దృష్టికి తీసుకెళ్లి వివరించామని తెలిపారు. ఈ విషయంలో పోర్టు చైర్మన్ సానుకూలంగా స్పందించారని వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు.



పోర్టు చైర్మన్ అంగముత్తుకు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్‌కుమార్

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081 కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

సూర్యనారాయణమూర్తి పాదాలు తాకిన సూర్యకిరణాలు



మూలవిరాట్టు పాదాలను తాకిన కిరణాలు

అల్లిపురం: వేంకటేశ్వరమెట్టపై అలివేలు మంగమ్మ ఆలయంలో వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి మూలవిరాట్టును సూర్య కిరణాలు సోమవారం తాకాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు పాణంగిపల్లి కేశవాచార్యులు స్వామికి విశేష పూజలు చేశారు. ఉదయం 7 గంటల నుంచి 8లోగా సూర్య కిరణాలు మూలవిరాట్టును తాకాయన్నారు. ఏటా మూడు రోజులపాటు ఈ విధంగా సూర్యకిరణాలు తాకుతాయని ఆయన తెలిపారు.

కుట్టు శిక్షణ తరగతులు ప్రారంభం



కుట్టు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న నరవ ప్రకాశరావు

డాబాగార్డెన్స్: అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా బీచ్ రోడ్డులోని బ్రిడ్జ్ స్కూల్‌లో సోమవారం కుట్టు శిక్షణ తరగతులు మొదలయ్యాయి. బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ, జన శిక్షణ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరు నెలల శిక్షణ తరగతులను సంస్థ వ్యవస్థాపక గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పది కుట్టు శిక్షణ తరగతులు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లు కొనుగోలు చేసేందుకు బ్యాంక్‌ల ద్వారా పావలా వడ్డీకే రుణం అందిస్తున్నట్టు చెప్పారు. మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జన శిక్షణ సంస్థ ప్రతినిధి మనోహర్, శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి రమణకుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి

డాబాగార్డెన్స్: ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలంటూ పాత జైల్‌రోడ్డు ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద సోమవారం సీపీఎం నిరసన చేపట్టింది. 2019 ఏప్రిల్ నుంచి కొనుగోలు చేసిన ఎన్నికల బాండ్ల వివరాలు తక్షణమే బహిర్గతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ విషయమై గత నెల 15న సుప్రీం కోర్టు ఆదేశించినా.. ఎస్‌బీఐ చైర్మన్ బేఖాతర్ చేయడం, కేంద్ర ప్రభుత్వానికి లొంగిపోవడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ వివరాలు ఇచ్చేందుకు జూన్ 30 నాటికి గడువు కావాలని ఈ నెల 4న ఎస్‌బీఐ కోరడం సిగ్గుచేటన్నారు. కేవలం కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి భయపడి, ఎన్నికల తర్వాత ప్రకటిస్తామని చెప్పడమంటే సుప్రీంకోర్టు ఆదేశాలు తుంగలోకి తొక్కినట్టేనని ఆరోపించారు. రోజుకు 48 కోట్ల సాధారణ ఖాతాలు నిర్వహిస్తున్న ఎస్‌బీఐకి కేవలం 22 వేల ఖాతాల వివరాలు తెలియజేయడానికి 116 రోజుల గడువు ఎందుకని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం ఒక డిజిటల్ ఇండియా అంటోందని, ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసిన వారి వివరాలు ఎప్పటికప్పుడు డిజిటలైజ్ చేయబడతాయి కదా అని ప్రశ్నించారు. 22 వేల బాండ్ల ద్వారా రూ.8,970 కోట్లు కొనుగోలు చేస్తే అత్యధిక బాండ్ల ద్వారా రూ.6,566 కోట్లు బీజేపీ పొంది అగ్రస్థానంలో ఉందన్నారు. అందుకనే మోదీ సర్కారు అడ్డుకుంటుందని చెప్పారు. ఎన్నికల బాండ్ల వ్యవహారాన్ని సుప్రీంకోర్టు సుమోటాగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, పి.మణి, ఎం.సుబ్బారావు, యూఎస్ఎన్ రాజు, కె.కుమారి, చంద్రమౌళి, చలపతి, గణేష్, నర్సింగరావు, రమణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

వడ్డీ లేకుండా ఆస్తి పన్ను చెల్లించండి

- జెడ్సీ పీవీవీడీ ప్రసాదరావు



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు

జగదాంబ : జీవీఎంసీ జోన్–4 పరిధిలో ఆస్తి పన్నును ప్రజలు వడ్డీ లేకుండా చెల్లించాలని జోనల్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జోనల్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, సెక్రటరీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్‌లోని 12 వార్డుల్లో ప్రజలు ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, నీటి పన్ను వడ్డీ లేకుండా చెల్లించుకునే అవకాశం జీవీఎంసీ కల్పించిందన్నారు. సూర్యాబాగ్ జోనల్ కార్యాలయంలోని సౌకర్యం కేంద్రంలో చెల్లించాలని సూచించారు. రెవెన్యూ అధికారులు, సెక్రటరీలు త్వరగా పన్నులు వసూలు చేయాలన్నారు. మొండిబకాయిదారులకు ముందుగా నోటీసులు ఇవ్వాలన్నారు. అయినప్పటికీ చెల్లించకుంటే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ వసూళ్లలో జీవీఎంసీ పరిధిలో మన జోన్ ముందు వరుసలో వుండాలన్నారు. సమావేశంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గీత సహ కులాలకు మూడు సీట్లు ఇవ్వాలి

సీతమ్మధార: వచ్చే ఎన్నికల్లో ఉత్తరాంధ్ర జిల్లాలో గీత సహ కులాల (శెట్టిబలిజ, యాత, శ్రీశైన, గౌడ, ఈడిగ)కు మూడు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని నాయకులు నినదించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఉత్తరాంధ్ర శెట్టి బలిజ భవనంలో గీత కులాల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గుత్తుల మధుసూదనరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలో పది లక్షలు మంది ఓటర్లున్నారని, ఏ రాజకీయ పార్టీ 50 ఏళ్లుగా తమకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. 2024 ఎన్నికల్లో ఏ పార్టీ అయితే గీత కులాలకు ప్రాధాన్యత ఇస్తుందో ఆ పార్టీకే తామంతా మద్దతు ఇస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ,ఎస్టీ,మైనార్టీ రాష్ట్ర కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావు, దొమ్మేటి నారాయణమూర్తి, జమ్ముల అప్పారావు, సిమ్మా అప్పారావు, చెల్లిబోయిన గోవింద్, కొల్లూరి శ్రీనివాసరావు, గుత్తుల తులసీ పార్వతి పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న శెట్టిబలిజ నాయకులు

ఘనంగా పోలమాంబ తొలేళ్ల ఉత్సవం

డాబాగార్డెన్స్: పాతనగరం మంథావారి వీధి(రజక వీధి)లో వెలసిన పోలమాంబ జాతర(33వ పరస) మహోత్సవాల్లో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజలు, 7 గంటలకు పంచామృతాభిషేకాలు, సహస్ర అర్చనలు, జోగి కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు అమ్మవారి సారె ఊరేగింపు, ఉయ్యాల కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు.

నేడు ప్రధాన జాతర

మంగళవారం ప్రధాన పండగ, అమ్మవారి జాతర కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్టు ఉమా మహేశ్వర ఆలయం, పోలమాంబ అమ్మవారి సేవా సంఘం అధ్యక్షుడు దమరశింగు కనకారావు, కార్యదర్శి గుడివాడ శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కరగాని శంకరరావు, ఉపాధ్యక్షులు బొండాడ లక్ష్మీప్రసాద్, కోట్ల సాయిబాబా, కోశాధికారి పండా సత్యనారాయణ, సన్నీ, డి.త్రినాథరావు, జి.రత్నం, బంకా వాసు, ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఉదయం 7 గంటలకు కుంకుమ పూజలు, పుష్పాలంకరణ, సాయంత్రం అగ్నిగుండం, పులివేశాలు, తప్పెటగుళ్లు, తాడేపల్లిగూడెంచే కాళికశక్తి ట్రూప్ తదితర కార్యక్రమాలతోపాటు రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా ఏర్పాటు చేసినట్టు సంఘ సభ్యులు తెలిపారు. 17వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణం వద్ద పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నట్టు చెప్పారు.



అమ్మవారి ప్రతిమలు ఊరేగిస్తున్న భక్తులు

సమన్వయంతో ఆలయాల అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- రెండు ఆలయాలకు ట్రస్టుబోర్డు సభ్యుల ప్రమాణం



ప్రమాణం చేస్తున్న విఘ్నేశ్వర స్వామి ట్రస్ట్‌బోర్డు సభ్యులు

డాబాగార్డెన్స్: నియోజకవర్గంలో విశిష్టమైన విఘ్నేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులు సోమవారం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, నాయకుడు మాసిపోగు రాజు నేతృత్వంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులతో ఆలయ అర్చకులు ప్రమాణ స్వీకారం చేయించారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా వెంకట నరసింగరావు, సభ్యులుగా ఉమామహేశ్వరరావు, పి.కనకమహాలక్ష్మి, కె.జయంతి, పి.లక్ష్మణరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ ఆలయాన్ని అందరినీ సమన్వయం చేసుకుంటూ మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో 30 ఏళ్ల వరకు సీఎంగా ఉంచాలని విఘ్నేశ్వర స్వామిని వేడుకోవాలన్నారు. దేవుడు మనిషి రూపంలోనే సాయం అందిస్తాడని, ఆ సాయమే మన జగనన్న అని వాసుపల్లి తెలిపారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి జగనన్నకు బహుమతిగా అందజేయడమే లక్ష్యంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జేఎస్ చౌల్ట్రీ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

జేఎస్ చౌల్ట్రీ ధర్మకర్తల మండలి...

దక్షిణ నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకమైన దేవాలయాల్లో ఒకటైన జేఎస్ చౌల్ట్రీ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం సోమవారం అట్టహాసంగా సాగింది. వార్డు కార్పొరేటర్ మేరీజోన్స్, నాయకుడు మాసిపోగు రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వాసుపల్లి గణేష్‌కుమార్‌తోపాటు ఆలయ అర్చకులు పాల్గొని సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ధర్మకర్తల మండలి చైర్మన్‌గా కుందేటి సుధాకర్, సభ్యులుగా కనకల రాజు, పత్తి రమణ, తుపాకుల విజయలక్ష్మి, వేమవరపు దేవి, వడ్డాది దేవి ప్రమాణ స్వీకారం చేశారు.

మానవత్వంలోనే దైవత్వం

డాబాగార్డెన్స్: మానవత్వంలోనే దైవత్వం ఉంటుందని శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్(సేవ) వ్యవస్థాపక అధ్యక్షురాలు పైడి రజని పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా కొండకర్లలో ఈచా ఫౌండేషన్ నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల కేంద్రాన్ని శక్తి బృందం సోమవారం సందర్శించింది. కేంద్రం నిర్వహణకు రూ.20 వేల నిత్యావసర సరకులు, అవసరమైన మందులు పైడి రజని అందజేశారు. మిసెస్ ఇండియా రన్నర్ జ్యోతి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ నడవలేని, మాట్లాడలేని పరిస్థితుల్లో ఉన్న పిల్లలు, పెద్దలకు అన్ని విధాల సేవలందిస్తున్న నిర్వాహకురాలు మధుతుగ్నైత్ సహాయక బృందాన్ని అభినందించారు. ఆశ్రమంలో 30 మంది పిల్లలు ఉన్నారని, ఒక్కొక్కరికీ నెలకు రూ.6 వేల చొప్పున ఖర్చవుతున్న నేపథ్యంలో దత్తత తీసుకునేందుకు దాతలు ముందుకొస్తే మరింత మందికి సహాయమందించేందుకు అవకాశం ఉంటుందని కోరారు. ఫౌండేషన్ ట్రస్టీ, ఏవీఎన్ కళాశాల కరస్పాండెంట్ ఏవీ ఆదీప్ భానోజీరావు మాట్లాడుతూ మానసిక దివ్యాంగుల కోసం నడుపుతున్న సంస్థను నిలబెట్టేందుకు శక్తి అసోసియేషన్ ప్రతినిధులు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చందన, వరలక్ష్మి, అనురాధ, శీలా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మానసిక దివ్యాంగురాలితో శక్తి సంస్థ అధ్యక్షురాలు పైడి రజని

ఎర్నిమాంబ ఆలయ అభివృద్ధికి కృషి



కార్పొరేటర్ పూర్ణిమను సత్కరిస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో వెలసిన అచ్చియ్యమ్మపేట గ్రామదేవత ఎర్నిమాంబ అమ్మవారి దేవస్థానం ట్రస్టు బోర్డు కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమను ఘనంగా సత్కరించారు. నూతన ధర్మకర్తల మండలి కార్యవర్గ సభ్యులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ధర్మకర్తల మండలి ఏర్పడ్డాక ఆలయం బాగా అభివృద్ధి చెందిందనేలా ఉండాలని, భక్తులందరికీ పారదర్శకంగా సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జేసీఎస్ అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, ఆలయ ఈవో సురేష్‌బాబా, ఆలయ చైర్మన్ ఎల్.రమణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు